# శిథిలావస్థలో రామాయంపేట పశు వైద్యశాల

## బిక్కుబిక్కుమంటూ కార్యాలయంలో కూర్చుంటున్న డాక్టర్లు



**మూగజీవాలకు వైద్యం అందక ఇబ్బందులు**

**రామాయంపేట ఏప్రిల్ 29 (సిరి న్యూస్)**

రామాయంపేట పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. చెత్తాచెదారం నిండిపోయి రెండు గదులునిరుపయోగంగా ఉన్నాయి. గతంలో రామాయంపేట చుట్టుపక్కల గ్రామాల గ్రామాల పశువులతో పాటు, గొర్రెల కాపరులు పశువులకు ఏవైనా వ్యాధులు సోకితే రామయంపేటకు వచ్చి వైద్యం చేయించుకొని వెళ్లేవారు. పశువైద్య డాక్టర్లు సైతం గ్రామాల్లో గాలికుంట, నట్టల నివారణ టీకాలు గ్రామాలకు వెళ్లి అందించేవారు. కానీ నేడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. శిథిలావస్థకు చేరిన భవనంలోనే ఒక గదిలో పశువులకుఅందించే టీకాలతో పాటు మందులు ఉంచి పక్కనే ఒక కుర్చీ వేసుకొని కూర్చునే పరిస్థితి నెలకొంది. ఈ మధ్యకాలంలో కనీసం పశు వైద్యశాల ఉందనే విషయాన్ని సైతం మర్చిపోయే విధంగా తయారయింది. పశు వైద్య చికిత్సల కోసం వచ్చినవారు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ ఏ మందులు అందుబాటులో ఉన్నాయో లేవో అర్థం కాని పరిస్థితి దాపురించింది. ఇదిలా ఉండగా గతంలో గ్రామ గ్రామాన పశు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వ్యాధుల బారిన పడ్డ గొర్రెలు, మేకలు, పశువులకు వైద్యం చేసేవారు. కానీ ఇప్పుడు అలాంటి శిబిరాలు ఎక్కడ కూడా జరగడంలేదు. పశువైద్యాధికారులుఅందుబాటులో ఉండి వ్యాధులకు అవసరం ఉన్న మందులు సిద్ధంగా ఉంచాలని మూగజీవాలను కాపాడుకోవడానికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. అలాగే వన్యప్రాణులు గాయపడ్డ, అస్వస్థతకు గురి అయిన సమయానికి వైద్యం అందడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇటీవల తోనిగండ్ల గ్రామ శివారులో కృష్ణ జింకను ఊర కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలుపగా వెటర్నరీ డాక్టర్‌ను తీసుకొని ఘటన స్థలానికి చేరుకునేలోగా ఆ కృష్ణ జింక మృతిచెందింది. ఇదొకటే కాకుండా వన్యప్రాణులు గాయపడ్డ అశ్వస్థతకు గురైనా సకాలంలో చికిత్సలు అందిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

**అందుబాటులో ఉంటున్నాం.. కానీ భయం గుప్పెట్లో ఉంటున్నాంః వెటర్నరీ ఏడి తిరుపతి..**



మేము ఎల్లప్పుడూ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటున్నాం. కానీ భవనం శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న గోడౌన్‌లో విధులు నిర్వహించడం జరుగుతుంది. శిథిలావస్థలో ఉన్న భవనం గురించిపై అధికారులకు తెలపడం జరిగింది. అలాగే పశువులతో పాటు అస్వస్థతలకు గురైన వన్యప్రాణులకు సరైన సమయంలో వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

# పెండింగ్ వేతనాలు ఇవ్వాలి , పే స్కేల్ అమలు చేయాలి

**అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ఈజీఎస్ ఉద్యోగులు**

**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్ 29 సిరి న్యూస్:**

ప్రభుత్వం ఈజీఎస్ ఉద్యోగులకు పెస్కేల్ అమలు చేస్తానని చేసిన వాగ్దానం ప్రకారం వెంటనే అమలు చేయాలని, అదేవిధంగా గత మూడు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను తక్షణం విడుదల చేయాలని కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు ఈజీఎస్ ఉద్యోగుల జేఏసీ అందజేసింది.. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. గత మూడు నెలల నుండి వేతనాలు లేకుండా అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడం లో మా వంతు పూర్తి సహకారం అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేలు అమలు చేస్తామని ప్రకటించినా అది ఇప్పటికే కార్యరూపం దాల్చకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చేసిన వాగ్దానం మేరకు ఉపాధి ఉద్యోగులందరికీ పేస్కేల్ అమలుతోపాటు పెండింగ్లో ఉన్నటువంటి మూడు నెలల వేతనాలను తక్షణం విడుదల చేయాలని అన్నారు. లేనిచో రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు సమ్మె కార్యాచరణను అమలు చేయడం జరుగుతుందని అధికారులకు సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏపిఓ లు మహిపాల్ రెడ్డి, శ్యామ్ కుమార్, శంకర్, పౌల్, ఈసీ లు వేణు, కృష్ణ %టా% ల సంఘం జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్, సీఓ ల సంఘం రాష్ట్ర నాయకులు రాము, జేఏసీ ప్రతినిధులు శశిరేఖ, స్వప్న, బాలరాజ్, అనిల్, సంతోష్ తో పాటు ఇతరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా గ్రామీణ భివృద్ధి అధికారికి సైతం వినతిపత్రం అందజేయడం జరిగింది..



## చిరుధాన్యాల పరిరక్షణ అభినందనీయం

## శాస్త్రవేత్త డాక్టర్ గౌరీశంకర్

**జహీరాబాద్, ఏప్రిల్ 29 సిరి న్యూస్ :**



చిరుధాన్యాల సంరక్షణలో జహీరాబాద్ డీడీఎస్ సొసైటీ మహిళా సంఘాల సభ్యులు చేస్తున్న కృషి ఎనలేనిదని విత్తన శాస్త్రవేత్త డాక్టర్ గౌరీశంకర్ కొనియాడారు. జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్‌లోని డీడీఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం అంతర్జాతీయ విత్తన దినోత్సవాన్నిఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డీడీఎస్ కార్యాలయ ఆవరణలో విత్తన సంరక్షకుల సమావేశాన్ని నిర్వహించారు. డీడీఎస్ సొసైటీ పరిధిలోని 30 గ్రామాలకు చెం దిన 60 మంది విత్తన సంరక్షకులు 70కి పైగా దేశీ విత్తనాలను ప్రదర్శించారు. ఇందులో అంతరించిపోతున్న అత్తాకోడళ్ల జొన్నలు, నల్లతొగరి, బుర్కతొగరి, తెల్ల శనగలు, నల్ల కొబ్బరి వంటి అరుదైన విత్తనాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఆనంతరం విత్తన శాస్త్రవేత్త డాక్టర్ గౌరీశంకర్ మాట్లాడుతూ..అంతరించిపోతున్న పూర్వ వ్యవసాయ పద్ధతులు, విత్తనాలను మళ్లీ తీసుకువచ్చేందుకు ప్రపంచ దేశాలు సైతం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కనుమరుగవున్న చిరుధాన్యాలను కాపాడుతూ, సాగు చేస్తున్న డీడీఎస్ మహిళా సంఘాల చేస్తున్న కృషి అభినందనీయం అని పేర్కొన్నారు. చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరో గ్యం చేకూరుతుందన్నారు. డీడీఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య వెలుగురి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశా ల్లో రైతులు విత్తనాలను దాచుకునే హక్కు లు లేవన్నారు. ప్రతి విషయంలో మార్కె ట్ మీద ఆధారపడాల్సిన పరిస్థితుల్లో రైతులు ఉన్నట్లు తెలిపారు. డీడీఎస్ సొసైటీ మహిళలు చిరుధాన్యాలను కాపాడుతూ, పంటల సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఝరాసంగం మండలం బిడెకన్న గ్రామానికి చెందిన జడల చంద్రమ్మ 58 రకాల విత్తనాలు, న్యాల్‌కల్ మండలంలోని గుంజోట్టికి చెందిన నర్సమ్మ 56 రకాల విత్తనాలు, జహీరాబాద్ మండలం పొట్‌పల్లికిచెందిన మొగులమ్మ 55రకాల విత్తనాలను ప్రదర్శించారు. వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, సొసైటీ సభ్యులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి..

**రామాయంపేట, ఏప్రిల్ 29 సిరి న్యూస్:**

రామాయంపేట పట్టణంలో మేడే 139వ కరపత్రాలను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఇవాళ పట్టణంలోని హమాలీ, తాపీ మేస్త్రీల సంఘం కార్మికులు ఏఐటీయూసీ మెదక్ జిల్లా కార్యదర్శి అయ్యవారి లక్ష్మన్ అధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం అయ్యవారి లక్ష్మన్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీలకు తగిన పనికి తగిన కూలీ ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికులు రోడ్డున పడే విధంగా చట్టాలను మారుస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చట్టాలను తమ చుట్టాలుగా మార్చవద్దన్నారు. 56 సంవత్సరాల వయస్సు దాటిన వారికి ప్రభుత్వం నెలకు రూ. 6వేల పింఛన్ ఇవ్వాలలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాళం బాలాగౌడ్, శ్రీశైలం, అల్లాడి రాములు, రాజేష్, యాదగిరి, వెంకటేశ్, సరుగు సిద్దరాములు, మర్కు రాములు, భిక్షపతి, శ్రీనివాస్, స్వామి, మద్దూరి రాజు, లింగం తదితరులు ఉన్నారు.